క్లుప్తంగా...

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

లాలాపేట: పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్–2023 ప్రవేశ పరీక్ష కోసం జంటనగరాల్లోని పేద విద్యార్థులకు శుక్రవారం నుంచి ఉచితంగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.తిరుపతిరెడ్డి, డి. శివప్రసాద్‌లో గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తపస్, అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణకు సంబంధించి సికింద్రాబాద్ హరిహరా కళాభవన్ సమీపంలో ఉన్న వైఎంసీఏ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతులు ఉంటాయన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ శిక్షణా తరగతులు నేటి నుంచి ప్రారంభం అవుతాయని ఆసక్తి గల విద్యార్థులు ఎస్సెస్సీ హాల్‌టికెట్ జిరాక్స్ తీసుకుని ఉదయం 10 గంటలకు వైఎంసీఏ ప్రభుత్వ పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సెల్ట్‌లో 8,9,10 విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై మే 1 నుంచి 31 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు జరిగే తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవాలని సెల్ట్ డైరెక్టర్ ప్రొ.నవీన్ తెలిపారు. మరిన్ని వివరాలకు 7989903001 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మే 19 నుంచి హైటెక్స్‌లో ఆభరణాల ప్రదర్శన



సనత్‌నగర్: వచ్చేనెల 19వ తేదీ నుంచి మూడ్రోజుల పాటు నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఆభరణాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమీర్‌పేటలోని గ్రీన్‌పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహకులు కైలాష్ చరణ్, వీకే మనోజ్, సురేష్ జైన్, సత్యసాయి వివరాలను వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా వ్యాపారస్తుల కోసం అంతర్జాతీయ స్థాయి ఆభరణాల ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన జ్యువెలరీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రదర్శనకు 10 వేల మందికి పైగా వ్యాపారులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం నిర్వాహకులు ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

నారాయణకు డాక్టరేట్ ప్రదానం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంగ్లిష్ విభాగం నుంచి భూపల్లి నారాయణ పీహెచ్‌డీ డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. సీనియర్ అధ్యాపకులు ప్రొ.గోపాల్‌రావు పర్యవేక్షణలో ఫ్రమ్ నీలిజం టు అఫర్మేషన్ ఎ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ ఎర్నెస్ట్ హెమింగ్ వే అండ్ స్కాట్ ఫిడ్జెరల్డ్ అనే అంశం పై పరిశోధనకు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, తెలంగాణ ఉద్యమంలో నారాయణ చురుకైన పాత్ర పోషించారు.

రంజాన్ కానుకల పంపిణీ

రసూల్‌పురా: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బోర్డు ఎనిమిదో వార్డు రిసాల బజార్, సదర్ బజార్ మసీదుల వద్ద రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జైప్రకాష్ పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యం ఇస్తూ పండుగలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. మహేశ్వర్ రెడ్డి, జే. లోకనాథ్. పాండుయాదవ్, మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, నివేదిత, బాల్‌రాజ్, జవహర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

టోల్ నష్టపరిహారాన్ని రాష్ట్రం భరించాలి



కంటోన్మెంట్: టోల్ ట్యాక్స్ రద్దు నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్‌లో టోల్ వసూళ్లకు పూర్తిస్థాయిలో తెరపడంతో జూబ్లీ చౌరస్తాలోని టోల్ బూత్ వద్ద బీజేపీ నేతలతో కలిసి ప్రధాన మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. జీఎస్టీ అమల్లోకి రావడంతో ఆరేళ్ల క్రితమే ఆక్ట్రాయ్ రద్దయిందని తాజాగా ఈజ్ ఆఫ్ లివింగ్‌లో భాగంగా కేంద్రం టోల్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేసిందన్నారు. ఆక్ట్రాయ్ రద్దు కారణంగా జీఎస్టీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు మళ్లుతున్నాయని ఆరేళ్లుగా జీఎస్టీలో కంటోన్మెంట్ వాటా ఇవ్వడం లేదన్నారు. టోల్ ట్యాక్స్ రద్దుతో కంటోన్మెంట్‌కు యేటా రూ.9 కోట్ల నష్టం వాటిల్లుతోందని ఈ నష్టాన్ని రాష్ట్రప్రభుత్వం భరించాలన్నారు. బీఎస్ శ్రీనివాస్, టోపీ శంకర్, నాగభూషణం రెడ్డి, రాపోలు మాధురి పాల్గొన్నారు.

1 కిలో మీటర్ రోడ్డు.. 5 ఏళ్లుగా పనులు!



- ఏళ్ల తరబడి కొనసాగుతున్న లాలాపేట ప్రధాన రహదారి విస్తరణ
- రెండు గజాల ముందుకు జరిగిన వ్యాపారాలు
- దృష్టి సారించని అధికారులు
- ట్రాఫిక్ జాంతో సతమతమవుతున్న వాహనదారులు

లాలాపేట: అధికారుల నిర్లక్ష్యం.. కోర్టు వివాదాలు, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా లాలాపేట ప్రధాన రహదారి విస్తరణ పనులు గందరగోళంగా మారాయి. లాలాపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి మౌలాలి ఫ్లైఓవర్ పూలే విగ్రహం వరకు దాదాపుగా 1.2 కిలో మీటర్ల దూరం 100 అడుగుల వెడల్పు రహదారి విస్తరణ పనులు చేపట్టి సుమారుగా ఐదేళ్ల అవుతోంది. ఆది నుంచి ఆ పనులు ఓ అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా కొనసాగాయి. రోడ్డుకి ఇరువైపులా 152 నిర్మాణాలు తొలగించాల్సి ఉండగా ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ అధికారులు దాదాపు వంద వరకు తొలగించారు. విస్తరణ పనులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

- లాలాపేట ఫ్లైఓవర్ నుంచి మౌలాలీ ఫ్లై ఓవర్ వరకు 1.2 కిలో మీటర్లు దూరం.
- 100 అడుగుల వెడల్పు. రూ. 100 కోట్ల వ్యయం (నష్టపరిహారం రూ. 50 కోట్లు, మోడల్ రోడ్డు నిర్మాణానికి రూ.50 కోట్లు).
- విస్తరణలో కోల్పోతున్న ఆస్తుల సంఖ్య 152

స్తంభాలు తీయరు..రోడ్డు వేయరు..

లాలాపేట రోడ్డు విస్తరణ పనుల్లో రోడ్డుకు రెండు వైపులా పలు నిర్మాణాలను తొలగించారు. దీంతో గతంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రస్తుతం రోడ్డు మధ్యలోకి వచ్చాయి. నిర్మాణాలు తొలగించిన స్థానంలో రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి నష్టపరిహారం తీసుకున్న కొందరు వెనక్కి జరిగినట్లే జరిగి మరో రెండడుగులు ముందుకేసి రోడ్డుకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించగా మరికొందరు రోడ్డుకు కేటాయించిన స్థలాన్ని చిరు వ్యాపారులకు ఇచ్చి నెల వారి అద్దెలు వసూలు చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో లాలాపేట రోడ్డు విస్తరణ చేసినా ఫలితం లేకుండా పోతుంది. లాలాపేట ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించకపోగా ఉదయం, సాయంత్రం మరింత జఠిలంగా మారుతుంది. వారాంతపు సంత రోజు వాహనదారులకు ఈ మార్గంలో నరకయాతన తప్పడం లేదు.

మోడల్ రోడ్డు పేరుతో..

లాలాపేట ప్రధాన రహదారిని విస్తరించి మోడల్ రోడ్డుగా తయారు చేస్తామని గత ఐదేళ్ల క్రితం ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలు ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఇంకా విస్తరణ పనులు సగమైనా పూర్తి కాలేదు.మోడల్ రోడ్డు నిర్మాణం చేయడానికి ఇంకా ఎంతకాలం అవుతుందోనని లాలాపేట వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డును విస్తరించిన ప్రాంతంలో వెలసిన వ్యాపార సముదాయాలు



రోడ్డు మధ్యలోకి వచ్చిన విద్యుత్ స్తంభాలు

అధికారులు ఏమంటున్నారంటే..

లాలాపేట రోడ్డు విస్తరణ కాలయాపనపై సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా డాక్యుమెంట్స్ క్లియర్ లేనివి, ఇంకా సరైన పత్రాలు లేకుండా, కోర్టు వివాదాలు, ఫ్యామిలీ సంబంధ వివాదాలతో రోడ్డు విస్తరణలో జాప్యం జరుగుతుంది. దీంతో 25 ప్రాపర్టీస్‌కు నష్ట పరిహారం చెక్‌ల కోసం లాండ్ అక్వేషన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయిస్తే పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు.

ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలి



ట్రాఫిక్ కష్టాలు తగ్గించాలనే ఉద్దేశ్యంలో ప్రభుత్వం కోట్ల రూపాయలు ప్రజాధనం వెచ్చించి లాలాపేట ప్రధాన రహదారి విస్తరణ చేపట్టింది. విస్తరణలో నెలకొన్న కాలయాపనతో ప్రభుత్వానికి చెడుపేరు వచ్చేలా అధికారులు వ్యవహరించడం తగదు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే ఉద్దేశ్యంతో లాలాపేట రోడ్డు విస్తరణ చేపట్టారు. రోడ్డుకు కెటాయించిన స్థలాన్ని వ్యాపారులు తిరిగి ఆక్రమించి ట్రాఫిక్ సమస్యను మళ్లీ మొదటికి తీసుకు వచ్చారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇప్పటి వరకు విస్తరించిన ప్రాంతంలో తాత్కాలిక రోడ్డు నిర్మాణం చేస్తే వాహనాల రాకపోకలకు వీలుగా ఉంటుంది.

–మల్లికార్జున్, లాలాపేట

ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలి..



2019 ఎన్నికల ముందు లాలాపేట రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో సైతం ఇంత సమయం తీసుకొని ఉండరు. కేవలం కిలో మీటరు దూరం రహదారి విస్తరణ పనులు ఏళ్ల తరబడి చేస్తున్నారంటే ప్రభుత్వం పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోచ్చు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్య ధోరణి విడనాడాలి. విస్తరణ పనులు పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలి.

–శ్రీరాం కృష్ణ, లాలాపేట

సమస్యల పరిష్కారంలో ముందుంటా

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లో గురువారం ఆయన స్వామి టాకీస్ సమీపంలోని శ్రీనివాస్ భవన్ వద్ద రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, రూ.75 లక్షలతో వాటర్‌పైప్‌లైన్ పనులు, జెక్‌కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. స్వామి టాకీస్ వద్ద కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని స్థానికులు మంత్రిని కోరగా, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. దాసారం బస్తీవాసులతో ఏర్పాటుచేసిన సమావేశంలో తమకు కమర్షియల్ విద్యుత్ బిల్లులు ఇస్తున్నారని, అధికంగా బిల్లులు వస్తున్నాయని మంత్రికి వివరించగా అక్కడి నుంచే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా మంచినీటి నల్లాలను ఏర్పాటుచేయాలని కోరగా, మూడు నాలుగు రోజుల్లో ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు.మరికొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో అన్ని శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తానని, దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ రవికిరణ్, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్, ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, జెక్‌కాలనీ అధ్యక్షులు జి.సూర్యశంకర్‌రెడ్డి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కానుకల పంపిణీని పర్యవేక్షించాలి..

రంజాన్ సందర్భంగా ప్రభుత్వం పేద ముస్లింల కోసం అందిస్తున్న గిఫ్ట్ ప్యాక్‌లను సక్రమంగా పంపిణీ జరిగేలా పర్యవేక్షించాలని మంత్రి తలసాని సూచించారు. ప్రభుత్వపరంగా నిర్వహించే ఇఫ్తార్ విందుకు ఎలాంటి అవాంతరాలు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: వర్షాకాలనికి ముందుగానే నాలాల్లో పూడికతీత పనులను పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి సూచించారు. గురువారం లాలాపేటలో ప్రారంభమైన ఓపెన్ నాలా పూడికతీత పనులను పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో నాలాలు పొంగిపొర్లకుండా పూర్తి స్థాయిలో పూడిక తీసేలా అధికారులను నిత్యం పర్యవేక్షించాలన్నారు. చెత్త చెదారం, వ్యర్థాలను నాలాల్లో వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ రఘు, ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

భవర్‌లాల్‌వర్మకు నివాళి

రాంగోపాల్‌పేట్: బీజేపీ లింగ్విస్టిక్ సెల్ మాజీ చైర్మన్ భవర్‌లాల్‌వర్మ జయంతి సందర్భంగా గురువారం ఆ పార్టీ నాయకులు శీతలపానియా లు , స్వీట్లు పంపిణీ చేశారు. సుభాష్‌రోడ్డులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో వర్మకు ప్రత్యేక స్థానం ఉండేదని ఆయన లేనిలోటు ఇప్పుడు కనిపిస్తుందని ఆకుల ప్రతాప్, మల్లేష్, సందీప్‌వర్మ, మనోహర్, కనకసేన, ఆనంద్ వ్యాస్, నరేష్ పేర్కొన్నారు.

జైభారతి హైస్కూల్ చౌరస్తాలో..

సనత్‌నగర్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ కోశాధికారి భవర్‌లాల్‌వర్మ జయంతి సందర్భంగా గురువారం జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు ఆకుల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ జైభారతి హైస్కూల్ చౌరస్తాలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో బాలనరసింహ, దయానంద్, లక్ష్మీనారాయణ, క్రాంతికుమార్, నక్క శ్రీనివాస్, సుమన్, కుషాల్, శ్రీనివాసరావు, చంద్రకుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ అన్నారు. గురువారం సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్ల పరిధిలోని మూడు ప్రాంతాల్లో రంజాన్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం రూ.50 లక్షల వ్యయంతో చిలకలగూడ, బ్రాహ్మణబస్తీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ వేడుకలకు ఇబ్బందులు లేకుండా ఈద్గాలు, మసీదుల వద్ద వసతులు కల్పించి, అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. వేలాది మంది ప్రార్థనలు చేసే చిలకలగూడ, లాలాగూడ ఈద్గా మైదానాలను సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. సంక్షేమ పథకాల కోసం దళారులను ఆశ్రయించొద్దని నేరుగా సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, నాయకులు తీగుళ్ల కిషోర్, రామేశ్వర్‌గౌడ్, కరాటే రాజు, కేఎం శ్రీనివాస్, బంగారు నాగేందర్, రాజసుందర్, శైలేందర్ పాల్గొన్నారు.

జయంతి వేడుకలకు భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి కూడలిలో ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ పరంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏటా అత్యంత వైభవంగా జయంతి వేడుకలను ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అంబేడ్కర్ కూడలిలో ప్రభుత్వ పరంగా జరుగుతున్న ఏర్పాట్లను సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారి సురేశ్ పర్యవేక్షించారు. అనంతరం సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న రెయిన్‌బో లెర్నింగ్ సెంటర్‌ను సందర్శించారు. సెంటర్ ఇన్‌చార్జి జయతో కలిసి అందులో శిక్షణ పొందుతున్న 40 మంది బాలలకు ప్యాడ్స్, పెన్సిల్స్ స్టేషనరీని అందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, గడ్డం ప్రసాద్, సీతారాం, సాయినాథ్, లలిత, జీవీ కృష్ణ, కరాటే రాజు, రాజ సుందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



విద్యార్థికి హెల్మెట్ పెడుతున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు ఇతరులకు అవగాహన కల్పించాలని బేగంపేట ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. సికింద్రాబాద్‌లోని మహబూబ్ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లెర్నింగ్ లైసెన్సుల ఎలా తీసుకోవాలని అవగాహన కల్పించడంతో పాటు 40 మంది విద్యార్థులకు స్లాట్ బుక్ చేశారు. హీరో మోటర్స్ ద్విచక్ర వాహనాల సంస్థ సహకారంతో ఉచితంగా హెల్మెట్లు అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. లైసెన్సులు లేవని చలాన్లు విధించడమే తమ విధిగా భావించకుండా లైసెన్సులు తీసుకోవడానికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా ఆన్‌లైన్ ద్వారా లెర్నింగ్ లైసెన్సులకు స్లాట్ బుక్ చేసుకుని లైసెన్సులు పొందవచ్చన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పొందితే వారు తమ కుటుంబం, స్నేహితులు, తెలిసిన వారికి అవగాహన కల్పిస్తారని అందుకే విద్యార్థుల కోసం ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తప్పక హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయకూడదని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వారికే కాకుండా ఇతరుల ప్రాణాలకు అపాయాన్ని తెచ్చిపెడుతుందన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. జీబ్రా క్రాసింగ్‌లను పాదచారుల కోసం వదలి పెట్టాలని స్టాప్ లైన్ వద్దే వాహనాలను నిలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది రాజేశ్వర్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలనే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్

కంటోన్మెంట్: బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాయ మాటలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్ ఆధ్వర్యంలో వెస్ట్ మారేడుపల్లి పద్మశాలి కల్యాణమండపంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గులాబీ జెండాను రెపరెపలాడించి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా కూర్చోబెట్టాలన్నారు. చేతికున్న ఐదువేళ్లు ఒక్కటై పిడికిలి బిగించినట్లుగా నేతలంతా ఒక్కటై పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. మర్రి రాజశేఖర్ రెడ్డి, గజ్జెల నాగేశ్, కృషాంక్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నివేదిత, ఎన్. శ్రీగణేశ్ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. జక్కుల మహేశ్వర్ రెడ్డి, పాండుయాదవ్, లోకనాథం, భాగ్య శ్రీ, టీఎస్ శ్రీనివాస్, ముప్పిడి మధుకర్, కృష్ణ యాదవ్, పెద్దాల నర్సింహ, సంతోషయాదవ్, సృజన్ ముదిరాజ్ పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

బౌద్ధనగర్: వారాసిగూడలోని పద్మశాలి సంఘం కార్యాలయ ఆవరణలో గురువారం రాష్ట్ర పద్మశాలి సంఘం అడహక్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బూర మల్లేషం మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం సభ్యత్వం వేగంగా చేయాలన్నారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామని ఎన్నికల్లో జాతీయ పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పురుషోత్తం, బలరాం, లక్ష్మీనారాయణ, బొమ్మ నరేంద్ర, అల్లి గోవింద్, జనార్ధన్, లక్ష్మీబాయి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అసభ్య కార్యకలాపాలకు అంగీకరించలేదని దాడి

- మహిళ ఫిర్యాదుతో పలువురిపై కేసు నమోదు

సనత్‌నగర్: అసభ్య కార్యకలాపాలకు అంగీకరించలేదని ఓ మహిళపై,ఓ బార్ నిర్వాహకుడితో పాటు పలువురు దాడి చేసిన సంఘటన ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన ఓ మహిళ (30)ను ఆమెతో సన్నిహితంగా ఉండే పద్మ (32) తన పుట్టినరోజు వేడుకలకు రావాలని ఆహ్వానించింది. ఎస్సార్‌నగర్‌లోని హంటర్ రెస్టో బార్‌కు రావాలని చెప్పడంతో ఈ నెల ఒకటో తేదీ సదరు మహిళ అక్కడికి వెళ్లింది. అయితే.. అక్కడ పుట్టిన రోజు వేడుకల లేకపోవడంతో ఆమె పద్మను నిలదీసింది. బార్ నిర్వాహకుడితో చనువుగా ఉండాలని సూచించడంతో బాధితురాలు అంగీకరించలేదు. దీంతో పద్మ మహిళను తీవ్రంగా దుర్భాషలాడడంతో పాటు దాడికి పాల్పడింది. బార్ నిర్వాహకుడు కృష్ణతో పాటు బార్‌లోని ఆయన అనుచరులు రమాదేవి, శేఖర్ సైతం బాధిత మహిళపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీజేపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: బీజేపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని, ఆ పార్టీ నేతలు పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతున్నారని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. గురువారం జరిగిన బేగంపేట డివిజన్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరిలతో కలిసి హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నిరుపేదల పాలిట పెన్నిధిగా అన్ని సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందేలా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. ప్రజానేతగా పేరుగడించినందునే గత ఎన్నికల్లో ఎన్టీఆర్ కుటుంబం నుంచి నందమూరి సుహాసిని బరిలోకి నిలబడినా మాధవరం కృష్ణారావు అఖండ మెజార్టీతో విజయం సాధించారన్నారు. ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. బేగంపేట డివిజన్ ఒకప్పుడు ఏవిధంగా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో పరిశీలించాలన్నారు. జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ తరుణి, నాయకులు శ్రీహరి, సురేష్ యాదవ్, రాజయ్య, అనిత, శ్రీపాద పాల్గొన్నారు.

టెండరు నోటీసు

2BHK పొట్టి శ్రీరాములు నగర్, బన్సీలాల్ పేట్ డివిజన్ నందు షాపు నెంబర్లు 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9 కలవు. ఇట్టి షాపుల అడ్వాన్స్, రెంట్లు తదితర వివరాలు పొట్టి శ్రీరాములు నగర్ 2BHK ఆఫీసునందు తెలుపబడును.
వేలంపాట బుధవారము తేది: 26.04.2023 ఉ॥ 11 గం॥లకు.

పొట్టి శ్రీరాములు నగర్ వెల్ఫేర్ సొసైటీ,
బన్సీలాల్ పేట్.
ఫోన్: 6281054021, 9700315434

వైశాఖీ ఉత్సవాలు షురూ

సనత్‌నగర్: అమీర్‌పేటలోని గురుద్వారా ఆధ్వర్యంలో వైశాఖీ ఉత్సవాలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా తొలి రోజైన గురువారం అమృత్ సంచార్ (హోలీ బాప్టిజం) నిర్వహించారు. అమీర్‌పేట గురుద్వారాకు ప్రత్యేకంగా విచ్చేసిన పంచ్‌ప్యారాస్‌గా పిలిచే ఐదుగురు సిక్కు మత గురువులు (రాగి జత్థాస్) గుర్బాణీ కీర్తనలు ఆలపించి గురుగ్రంథాన్ని పఠిస్తూ అమృత్‌పాన్ (పవిత్ర పానీయం)ను తయారు చేశారు. హోలీ బాప్టిజంగా పేర్కొనే ఈ క్రతువు ద్వారా సిక్కు యువతీ యువకులు, పిల్లలు, మహిళలు అమృత్‌పాన్‌ను స్వీకరించారు. ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ భాగేందర్‌సింగ్, సర్దార్ సురేందర్‌సింగ్, ఉపాధ్యక్షులు సులక్షణ్‌సింగ్, సంయుక్త కార్యదర్శులు సర్దార్ జోగేందర్‌సింగ్, సర్దార్ ప్రహ్లాద్‌సింగ్, వేదిక కార్యదర్శి సర్దార్ నరేందర్‌సింగ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

‘బీజేపీ నేతల ఒత్తిడితోనే ఫ్లెక్సీల తొలగింపు’



ప్రకాశ్ అంబేడ్కర్‌కు ఆహ్వానం పలుకుతున్న మన్నె క్రిశాంక్

కంటోన్మెంట్: డా. అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బోర్డు అధికారులు తొలగించడం సరికాదని ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. గురువారం ప్యారడైజ్–తాడ్‌బండ్ మార్గంలో బీఆర్ఎస్ నేతలను ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోల్ బ్యానర్‌ను బోర్డు సిబ్బంది తొలగించారు. సమాచారం అందుకున్న మన్నె క్రిశాంక్, వెంటనే బోర్డు ఉన్నతాధికారులను సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. దీంతో విగ్రహావిష్కరణ కార్యక్రమం ముగిసేదాక ఫ్లెక్సీలను యధావిధిగా ఉంచేందుకు బోర్డు అధికారులు అంగీకరించినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని కంటోన్మెంట్‌లో బీజేపీ నేతల ఒత్తిడితోనే బోర్డు సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించినట్లు క్రిశాంక్ ఆరోపించారు.

ప్రకాశ్ అంబేడ్కర్‌కు ఆహ్వానం..

నేటి అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరు కానున్న అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్‌కు క్రిశాంక్ స్వాగతం పలికారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు ఆయనకు సూచించడంతో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ప్రభాకర్‌తో పాటు క్రిశాంక్ ప్రకాశ్ అంబేడ్కర్‌కు ఆహ్వానం పలికారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379